క్లుప్తంగా

భజన చెట్టుకు ప్రత్యేక పూజలు


మునగపాకలో భజన చెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు

మునగపాక: మునగపాకలో భజన చెట్టుకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 11న జరగనున్న శూలాల మహోత్సవంలో భాగంగా భజన చెట్టును ఇంటింటికీ తిప్పుతూ భజనలు నిర్వహించడం ఆనవాయితీ. దీనిలో భాగంగా సోమవారం రాత్రి మునగపాకలోని పలు ప్రాంతాల్లో సాంబశివుని ఆలయ కమిటీ చైర్మన్ బూడిద శ్రీనివాసరావు, ఇతర కమిటీ సభ్యులంతా భజన చెట్టు వద్ద గీతాలు ఆలపిస్తూ పూజలు నిర్వహించారు. ఈ భజన చెట్టుకు మహిళలు పూజించి మొక్కులు తీర్చుకున్నారు.

వెంకన్న ఆలయ నిర్మాణానికి విరాళం


ఆలయ నిర్మాణానికి విరాళం అందిస్తున్న ఆడారి తరుణ్

మునగపాక: ప్రతి ఒక్కరూ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. మునగపాకకు చెందిన వ్యాపారవేత్త ఆడారి కృష్ణ తనయుడు తరుణ్ మంగళవారం తనవంతు సాయంగా రూ.30,700 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండేలా రూ.5 కోట్ల వ్యయంతో శ్రీనివాసుని ఆలయ నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మునగపాక ఎంపీటీసీ సూరిశెట్టి రాము, తదితరులు పాల్గొన్నారు.

జేపీ అగ్రహారంలో రెవెన్యూ సదస్సు నేడు

మునగపాక: మండలంలోని జేపీ అగ్రహారంలో బుధవారం రెవెన్యూ సదస్సు జరగనున్నట్టు తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయం వద్ద ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ సదస్సును రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఎస్.రాయవరం: కొరుప్రోలు సబ్ స్టేషన్ పి.ధర్మవరం ఫీడర్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. పెనుగొల్లు గ్రామం మీదుగా కొత్త లైన్ ఏర్పాటులో భాగంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ మేరకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం


కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి నరసింగరావు

మునగపాక: క్రీడలతో మానసిక ప్రశాంతతతో పాటు ఉల్లాసంగా ఉండవచ్చని జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మళ్ల వరహా నరసింగరావు అన్నారు. నాగులచవితి సందర్భంగా వాడ్రాపల్లికి చెందిన కబడ్డీ కుర్రాళ్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను మంగళవారం రాత్రి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కబడ్డీ ఆటకు ఎంతో గుర్తింపు ఉందన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం అందరిపైనా ఉందని చెప్పారు. క్రీడల్లో రాణిస్తే ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పెతకంశెట్టి లీలా భాస్కరరావు, డీలర్ అప్పలనాయుడు, కబడ్డీ కుర్రాళ్ల నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదపుటంచున.. జల్లూరు వంతెన

- శిథిల వంతెనపై బిక్కుబిక్కుమంటూ రాకపోకలు
- అప్రోచ్ రోడ్డు లేక ప్రారంభోత్సవానికి నోచుకోని కొత్త బ్రిడ్జి
- ఇందేశమ్మవాక ఘాట్ రోడ్డులోనూ ఇదే దుస్థితి
- రామచంద్రపురం జంక్షన్‌లోనూ శిథిలమైన మరో వంతెన
- ప్రస్తుతం డైవర్షన్ రోడ్డులోనే రాకపోకలు


నిర్మాణంలో ఉన్న అప్రోచ్‌రోడ్డు


శిథిలావస్థలో ఉన్న జల్లూరు వంతెన

కోటవురట్ల: శిథిలావస్థకు చేరిన వంతెనలు వణికిస్తున్నాయి. ఏళ్ల తరబడి శిథిల వంతెనలే దిక్కవడంతో వాహనచోదకులు హడలెత్తిపోతున్నారు. ఏ క్షణంలో కూలిపోతుందోనని భయాందోళన చెందుతున్నారు. అనుక్షణం బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. మండలంలోని రెండు ప్రధాన వంతెనలు శిథిలం కావడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడంలేదు. ప్రధానంగా జల్లూరు వంతెన వాహనదారులను భయాందోళనకు గురిచేస్తోంది. పదేళ్ల క్రితమే ఈ వంతెన శిథిలం కావడంతో గత్యంతరం లేక ప్రమాదపుటంచున వాహన చోదకులు రాకపోకలు సాగిస్తున్నారు.

బ్రిటిష్ కాలం నాటిది..

జల్లూరు వంతెనను బ్రిటిష్ పాలకుల హయాంలో నిర్మించారు. ఈ వంతెన నిర్మించి సుమారు 80 ఏళ్లు కావస్తోంది. పదేళ్లుగా శిథిలమై అధ్వానంగా ఉన్న తప్పనిసరి పరిస్థితిలో ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ వంతెన నర్సీపట్నం, కోటవురట్ల, ఎస్.రాయవరం మండలాలకు వారధిగా ఉండగా నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తారు. ప్రస్తుతం ఏ క్షణంలోనైనా కూలిపోయేలా ఉంది. గతంలో వచ్చిన నీలం తుపాను ప్రభావంతో వంతెన పూర్తిగా బలహీనమైంది. దాంతో అప్పట్లో కొత్త వంతెన నిర్మాణానికి రూ.4.50 కోట్లు మంజూరు చేశారు. నిధులు చాలకపోవడంతో వంతెన నిర్మాణాన్ని మధ్యలో నిలిపివేశారు. మళ్లీ మరో రూ.2 కోట్లు నిధులు పెంచడంతో వంతెన నిర్మాణాన్ని పూర్తి చేశారు. వంతెన పూర్తి కావడానికి దాదాపు ఏడేళ్లు పట్టింది. వంతెన పూర్తయినా అప్రోచ్ రోడ్డు పూర్తి కాకపోవడంతో ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి మరో దఫా నిధులు విడుదల చేయడంతో నాలుగు నెలల క్రితం పనులు ప్రారంభించారు. ఈ పనులు నత్తనడకన సాగుతుండడంతో మరో ఏడాది పట్టే అవకాశం కనిపిస్తోంది.

రామచంద్రపురం జంక్షన్‌లో డైవర్షన్ రోడ్డుతో సరి

మూడు మండలాలకు ప్రధాన మార్గమైన ఈ రోడ్డులో రామచంద్రపురం జంక్షన్‌లో ఉన్న వంతెన కూడా పూర్తిగా శిథిలమై ఓ పక్క కుంగిపోయింది. ప్రమాద పరిస్థితి ఉండడంతో భారీ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దాంతో పక్కనే రూ.50 లక్షలతో డైవర్షన్ రోడ్డు నిర్మించారు. దీనిని కేవలం తూరలు వేసి దానిపై గ్రావెల్‌తో కప్పి చేతులు దులిపేసుకున్నారు. భారీ వర్షాలు పడితే ఈ డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోయే పరిస్థితి ఉంది.

ఇందేశమ్మవాక ఘాట్‌రోడ్డులో భయం భయం

ఇంకొంచెం ముందుకెళితే ఇందేశమ్మవాక ఘాట్ రోడ్డు ఎదురవుతుంది. ఈ ఘాట్‌రోడ్డును కూడా బ్రిటిష్ పాలకులే నిర్మించగా.. అప్పటి నుంచి అభివృద్ధికి నోచుకోలేదు. భారీ వర్షాలకు ఘాట్‌రోడ్డు కొంత మేర వరాహ నదిలోకి జారిపోయింది. దాంతో అడ్డుగా గోడ కట్టి వదిలేశారు. ఇక్కడి నుంచి భారీ వాహనాలు వెళ్లే అవకాశం లేకపోవడంతో ఆర్టీసీ బస్సులను నిలిపివేశారు. దాంతో నర్సీపట్నం–అడ్డురోడ్డు రహదారిలో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడంలేదు. అధికారులు స్పందించి ఈ మూడు అంశాలపై దృష్టి సారించి పరిష్కారం చూపాలని మూడు మండలాల ప్రజలు కోరుతున్నారు.

భయమేస్తోంది..



ఈ వంతెనపై రాకపోకలు సాగించాలంటే భయమేస్తోంది. ఏ నిమిషంలో పడిపోతుందో తెలీదు. నిత్యం భయం భయంగానే రాకపోకలు సాగిస్తున్నాం. రక్షణ గ్రిల్స్ కూడా కిందికి ఒరిగిపోయాయి. దాంతో ఆ పక్కగా వెళితే ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా నదిలో పడిపోవడం ఖాయం. అధికారులు స్పందించి త్వరగా కొత్త వంతెన ప్రారంభించాలి.

–పారుపల్లి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్, జల్లూరు

అప్రోచ్‌రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి



వంతెన నిర్మాణం పూర్తయినా అప్రోచ్ రోడ్డు పని పూర్తి కాలేదు. దాంతో శిథిల వంతెన మీదనే రాకపోకలు సాగిస్తున్నాం. అప్రోచ్ రోడ్డు పనులు ప్రారంభించి నాలుగు నెలలు అవుతున్నా ఇంకా పూర్తి కాలేదు. ఇలా కొనసాగితే ఇంకో సంవత్సరం పట్టేలా ఉంది. త్వరగా పూర్తి చేసి వంతెన ప్రారంభించాలి.

–పెట్ల రాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు, బి.కె.పల్లి

ఊపిరితిత్తుల క్యాన్సర్‌పై అవగాహన అవసరం


క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి శక్తిప్రియ, తదితరులు

ఎస్.రాయవరం: ఊపిరితిత్తుల క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని జాగ్రత్తలు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి శక్తిప్రియ అన్నారు. లంగ్స్ మాసోత్సవాలు పురస్కరించుకుని సర్వసిద్ధి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవగాహన లోపంతో చెడు ఆహారపు అలవాట్లు వల్ల పలు రకాల వ్యాధులకు గురవుతున్నారన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది చెప్పే ఆరోగ్య సూత్రాలు తెలుసుకుని పాటించాలన్నారు.

రీసర్వేలో లోపాల సవరణకు రెవెన్యూ సదస్సులు దోహదం


అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు

మునగపాక: రీ–సర్వేలో లోపాలను సవరించేందుకు రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు అన్నారు. మండలంలోని కాకరాపల్లి రామాలయం వద్ద మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో భాగంగా రైతుల నుంచి ఆయన దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గతంలో జరిగిన లోపాలను సవరించేందుకు ఇటువంటి కార్యక్రమం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సర్పంచ్ కొల్లి మునిసిలినాయుడు, ఎంపీటీసీ ఇల్లా శిరీష, రీ–సర్వే డీటీ పడాల్, గ్రామస్తులు పిట్టా మంగారెడ్డి, సంతోష్, నాగిరెడ్డి, తదితరులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

శిథిలావస్థలో మంచినీటి పథకం



మండలంలోని పల్లపు ఆనందపురం శివారు పురుషోత్తపురంలో రక్షిత మంచి నీటి పథకం శిథిలావస్థకు చేరింది. శ్లాబ్ పెచ్చులూడిపోతోంది. దీంతో ఎప్పుడు ఎటువంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

-మునగపాక


స్పందించాల్సిన అధికారి: మానస, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఫోన్ నంబరు : 7989780088.

ఘనంగా జాజులమ్మ పండగ


మల్లవరంలో జాజుల్ని మోస్తున్న మహిళా భక్తులు

అచ్యుతాపురం: జాజులమ్మ పండగ మంగళవారం ఘనంగా జరిగింది. తలపై నవధినుసులతో పెరిగిన మొక్కల బుట్టను పెట్టుకొని జాజులమ్మ నామస్మరణ చేసే మహిళలకు కోరికలు తీరుతాయని నమ్మకం. ఊరంతా జాజులమ్మ నామస్మరణ చేస్తూ చవితి రోజున బుట్టలను మోస్తూ సాగునీటి కాలువలో నవ ధినుసుల మొక్కల్ని వదులుతారు. గ్రామీణ ప్రాంతంలో ఒక్కోచోట ఒక్కో రకంగా నాగులచవితి వేడుకలు జరుగుతాయి. అచ్యుతాపురం మండలంలోని మల్లవరంలో ప్రతి ఏటా దీపావళి నుంచి నాగులచవితి వరకూ జరిగే నవధినుసుల పూజలు, చవితి రోజున జాజులమ్మ పండగకు విశిష్ట చరిత్ర ఉంది. మల్లవరంలోని ఓ ఇంటిలో తాటాకు బుట్టలో నవధినుసులను వేసి దీపావళి నుంచి నాగులచవితి వరకూ ప్రతి రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకూ పూజలు చేస్తారు. నవధినుసులు మొలకెత్తుతాయి. ఈ జాజుల్ని గౌరీపరమేశ్వరులుగా భావించి నాగులచవితి ఉదయం నుంచి బుట్టల్లో వేసి గ్రామంలో ఊరేగిస్తారు. ఈ బుట్టలు మోస్తే పెళ్లి కాని యువతులకు వివాహం జరుగుతుందని, పిల్లలు లేని వారికి సంతానం కలుగుతుందనే విశ్వాసం ఉంది. చివరగా జాజుల్ని స్థానికంగా నీరు పారే కాలువలో వదిలారు. దీపావళి నుంచి నాగులచవితి వరకూ జరిగిన జాజులమ్మ పండగ మంగళవారం సాయంత్రంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కండిపల్లి శ్రీనివాసరావు, గీసాల నాగమణి, పిన్నమరాజు వాసు, బీజేపీ నాయకులు చిన్నారావు, రవీంద్ర, చందక శివ, బాబ్జి, చిరంజీవి, రాజు, తిరుమలరావు, నాగేశ్వరరావు, గీసాల లోవ, వెంకట్, సూరిబాబు, నగేశ్, గండిబోయిన ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

దిమిలిలో ‘పొలం పిలుస్తోంది’


పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు


రాంబిల్లి(యలమంచిలి): రాంబిల్లి మండలంలో దిమిలి, పంచదార్ల గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయాధికారి సిహెచ్.సుమంత ఆధ్వర్యంలో నిర్వహించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయాధికారులు రైతు సేవా కేంద్రాల వద్ద రైతులకు పంటల సాగుకు సంబంధించిన అంశంపై సూచనలు సలహాలు అందించారు. ఈ సందర్భంగా సుమంత మాట్లాడుతూ రైతులకు రబీ సాగుకు సంబంధించి వరి, మినుము, పెసర విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు పంటల బీమాను ఈనెల 15వ తేదీలోగా చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు,రైతులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో చక్కటి ఆరోగ్యం

అనకాపల్లి: కరోనా వంటి విపత్తు తర్వాత ఆయుర్వేదంపై ప్రజలకు ఆసక్తి పెరిగిందని ఎన్టీఆర్ వైద్యాలయం ఆయుష్ విభాగం వైద్యురాలు కె.లావణ్య అన్నారు. మండలంలో తుమ్మపాల పీహెచ్‌సీ పరిధిలో ఆయుష్ వైద్యంపై ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించి, ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ లావణ్య మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే రోగులకు ఆయుష్ విభాగంలో ఉచితంగా వైద్యం చేసి మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.నిత్యం యోగా చేయడం వల్ల వ్యాధులతో బాధపడే రోగులు ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు నరసత్ సమీమ్, వాణీ జగదీశ్వరీ, యోగ శిక్షకుడు బి.అప్పారావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ లావణ్య తదితరులు

భక్తిశ్రద్ధలతో నాగులచవితి


యలమంచిలి నాగేంద్రస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు


భక్తులకు ప్రసాదాలు అందిస్తున్న కంభంపాటి వెంకటరమణ


యలమంచిలిలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు


ముసలమ్మవానిపాలెంలో కుటుంబ సమేతంగా నాగేంద్రునికి పూజలు చేస్తున్న భక్తులు


ఎస్.రాయవరంలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు


పాత వీధి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు


జానకయ్యపేటలో నాగుల చవితి వేడుకల్లో గురవయ్య కుటుంబం


మునగపాకలో పుట్టలో పాలుపోసేందుకు తరలివచ్చిన వేగి కుటుంబ సభ్యులు


మునగపాకలో పుట్టలో పాలుపోసేందుకు ఊరేగింపుగా వెళ్తున్న వెలగా కుటుంబ సభ్యులు


కోటవురట్లలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

నక్కపల్లి: నాగులచవితి పర్వదినాన్ని మంగళవారం ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆనందోత్సాహాల మధ్య జరుపుకొన్నారు. ఉదయాన్నే పొలాల్లో ఉన్న పుట్టల వద్దకు వెళ్లి నాగేంద్రుడికి పూజలు నిర్వహించి పాలు పోశారు. చలిమిడి చిమ్మిలి నైవేద్యంగా సమర్పించారు. పట్టణ ప్రాంతాల్లో ఉన్నవారు పుట్టల కోసం పల్లెల్లోకి వచ్చి పూజలు చేసి, పాలుపోశారు.

జానకయ్యపేటలో ప్రత్యేకత

నాగులచవితి పర్వదినం సందర్భంగా మండలంలో జానకయ్యపేటలో ప్రత్యేకత సంతరించుకుంది. గ్రామానికి చెందిన కురందాసు గురవయ్య కుటుంబానికి చెందిన వారసులు అంతా సుమారు 100 మంది కలిసి చవితి వేడుకలు జరుపుకొన్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వీరంతా గ్రామానికి తరలివచ్చి తమ పొలాల్లోని పుట్టలో పాలు పోసి పూజలు చేశారు.

యలమంచిలి రూరల్: నాగులచవితి సందర్భంగా యలమంచిలి పట్టణం, మండలంలో తెల్లవారుజాము నుంచే ఆలయాలు, పుట్టల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కుటుంబ సమేతంగా పుట్టల్లో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. నాగేంద్ర కాలనీలో కొలువుదీరిన నాగేంద్రస్వామికి భక్తులు అధిక సంఖ్యలో వెళ్లి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఇక్కడ ఆలయ ఆవరణలో ఉన్న పుట్టల్లో పలువురు భక్తులు పాలు పోసి, పూజలు నిర్వహించారు. ప్రతి ఏటా నాగుల చవితిని పురస్కరించుకుని ఆలయం వద్ద పంచరాత్రి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఆలయం పరిసర ప్రాంతాలు విద్యుత్ దీపాల అలంకరణతో కళకళలాడాయి. పట్టణంలోని పాతవీధి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని వెండి కవచం, పూలతో అలంకరించారు.

పాయకరావుపేట: మండలంలోని ఆయా గ్రామాల్లో కుటుంబ సమేతంగా పిల్లలు, పెద్దలు బయలుదేరి పుట్టల్లో పాలు వేసి పూజలు నిర్వహించారు. మంగవరం రోడ్డులో ఉన్న పుట్టలో పాలు పోయడానికి వెళ్లే భక్తులకు ఆధ్యాత్మిక వేత్త కంభంపాటి వెంకటరమణ ప్రసాదం అందజేశారు. వందలాది మంది భక్తులకు పులిహోర, దద్దోజనం, మజ్జిగ పంపిణీ చేశారు.

రాంబిల్లి(యలమంచిలి): రాంబిల్లి మండలంలో ప్రజలు నాగులచవితిని ఘనంగా జరుపుకొన్నారు. ప్రతి ఒక్కరూ కుటుంబ సమేతంగా పొలాల్లోని పుట్టల వద్దకు వెళ్లి పూజలు చేసి, పాలు పోశారు. పలు గ్రామాల్లో సాంస్కృతిక కార్యక్రమాల సందడి నెలకొంది. ఉత్సాహంగా మహిళలు కోలాటం ఆడారు.

మునగపాక: మండల వ్యాప్తంగా గ్రామాల్లో కుటుంబాలు అంతా కలిసి నాగులచవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఆయా కుటుంబాలు ఊరేగింపుగా పొలాలకు వెళ్లి పుట్టలో పాలు పోశారు. బాణసంచా వెలిగించి సందడి చేశారు.

అచ్యుతాపురం: మండలంలో నాగులచవితి వేడుకలతో సందడి నెలకొంది. ఉద్యోగ రీత్యా ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారు సైతం ఈ పండగకు విచ్చేసి తమ కుటుంబాలతో కలిసి పుట్టల్లో పాలు పోసి, పూజలు చేశారు. నిత్యం పొలాల్లో సంచరించే రైతులకు నాగేంద్రుడు రక్షణగా ఉండాలని మొక్కుకున్నారు. పూడిమడక, అచ్యుతాపురం, తంతడి, హరిపాలెం, జగన్నాథపురం, మల్లవరం తదితర గ్రామాల్లో నాగులచవితి వేడుకలు జరిపారు.

ఎస్.రాయవరం: మండలంలో నాగులుచవితి సందర్భంగా గ్రామాల్లో ఉమ్మడి కుటుంబ సభ్యులు ఒక్కచోట కలుసుకుని సందడి చేశారు. నాగేంద్రునికి పుట్టల వద్ద పూజలు చేశారు. కుటుంభ సభ్యులు ఆప్యాయంగా పలకరించుకుని సరదాగా గడిపారు. తరువాత గ్రూప్ ఫొటోలు తీసుకుని ముచ్చటపడ్డారు.

కోటవురట్ల: మండలంలో నాగులచవితి సందర్భంగా పల్లెల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. వేకువజాము నుంచి పొలాల్లో పుట్టల వద్దకు చేరుకుని అలంకరించి పూజలు చేశారు. పుట్టలో పాలు పోసి నాగేంద్రుడికి మొక్కారు.